# కవితా కౌముది

## ఏవేవో..

డా.మక్కెన శ్రీను

ఏవేవో కలలు రెప్పల్లో రేగుతున్నాయ్
కల్లం నిండా ధాన్యం రాసి పోసినట్టు
బోసి నవ్వుల్తో వడ్లు కేరింతలు కొట్టినట్టు
పుట్టెడు సంతానం ఏకంగా బందాడి నట్టు
బుడి బుడి నడకలతో ఇల్లు చేరినట్టు
గాదెల నిండా చేరి భరోసా ఇస్తున్నట్టు
చెంత చేరి నోట్లో కడుపారా ముద్దెట్టినట్టు !

ఏవేవో జ్ఞాపకాలు వెంటాడుతున్నాయి
నిన్నో మొన్నో కలిసి మనం నడిచి నట్టు
చేతిలో చెయ్యేసి ఊసులు చెప్పు కొన్నట్టు
ఒకరి నొకరు చూడద్దే బతుకే లేనట్టు
ఎవరున్నా లేకున్నా మనదే లోకమన్నట్టు
ఒకరి కొకరం తోడుందాం ఆన అన్నట్టు
చేతితో తడిమి తడిమి నిను లాలించినట్టు !

ఏవేవో సందేహాలు మెదడులో మొలిచాయ్
ఆశకి ఆశయానికి నడుమ విరోధం విత్తినట్టు
ద్రవ్య జలం సమకూరి మొలకలొచ్చినట్టు
బంధాలు తుంచే వృక్షమేదో పెరిగినట్టు
స్వార్థ మనే తుఫాను సర్వం పెకలించి నట్టు
తల్లి వేరు తో తనయుడు వేరై తల్లడిల్లి నట్టు
గతాన్ని తవ్వి గుబులు పెంచుతున్నట్టు!

ఏవేవో కథలు నాతోనే పరిభ్రమిస్తున్నాయ్
కల్లబొల్లి కబుర్లతో ఎవరో నిను మార్చినట్టు
కన్న కలలు కల్లలు చేసే చెడ పుట్టినట్టు
కనకం ఆశ చూపి కాని దొన్ని చేసినట్టు
అనుబంధాలు తెంపి అగాధం పెంచినట్టు
నిలువునా తెగనమ్మి బొక్కసం నింపుకొన్నట్టు!

ఏవేవో జవాబులు ఇకిలిస్తూ వున్నాయ్
నన్ను నిన్ను విడతీయడం ఎవరికి సాధ్యం
ఎవరైనా ఎప్పటికైనా నను చేరాల్సిందే
ఆస్తి అస్థి ధూళిలా వాయులీన మయ్యేదే
ఆరడుగుల భస్మ సింహాసనంపై ఊరేగాల్సిందే !

★★★

## ఆడుగో చందమామ
## డా.మూర్తి జొన్నలగెడ్డ

అడుగో చందమామ!
వెన్నెల దారాలతో
చుక్కల బొంతకు
చక్కగా కుట్టెయ్యండి.

నిశీధి సమయంలో
నిరాశ నీడల
దరికే రానివ్వడండి
అందరకీ తొనైయుండి

మీకింకా కనిపించలేదా?
మదినేలే మారాజ
మా చల్లని రేరాజ
మస్తిష్కపు మబ్బుల్లో

దోబూచులాడేనా?
నిన్నటి ఓ చిరుగాలి
ఈ నాటికి పెను గాలై
మబ్బులనే మరి తోలి

చుక్కల బొంత చూపించును
వెన్నెల దారం అందించును
మరి మదిలో తొంగి చూడు
అడుగో చందమామ!

★★★

## అయితే.. అయినా..
## డా.గాదిరాజు మధుసూదనరాజు

విడివిడిగా
మనసుల్ని తగిలించుకున్న
ఆడామగా కాయాల
అభ్యర్థి కణాలమధ్యలో ఇరుక్కుపోయి..
ఇంతికడుపులో బంతిలా..
ఇంతింతై పెరిగి
పొట్టకోటలోంచి బయటపడగానే
మనసుకి చిక్కిన పిచ్చి ఆత్మన్నేను.

అయితే....
నా మనసు
నా మాటవినకుండా
మదమాత్సర్యపు శత్రుకూటమితోచేరి
నన్నల్లరిపెడుతోంది
జననమరణజన్మచక్రాలమధ్య
నన్నిరికిస్తోంది

అయినా............
తప్పించుకోవటానికై
నిన్నందుకొని
పరమానందాన్ని
అందుకోవటానికై
జన్మజన్మలుగా ..
ఎదురుచూస్తూన్న
అలుపెరుగని ఆత్మన్నేను.

★★★

# వెలిగిద్దాం- - -

కృష్ణశ్రీ

అందాల కోన,
మరుగంధాల లోయ,
మలిసందె నావలో కదిలి వెళ్ళింది.
నిందలు లేని చోట గూడేసింది,
అడగవే చిలకా,
చెప్పుతావి వివరంగా!!

ఎగసిపడే కెరటాలు,
ముడుచుకునే ఆకులు,
లేని చోట ఏముంది కళ ?
పలకరించు రాగాలు,
పల్లవించు సుమగానాలు,
లేకుండ అంతా విలవిలా?
నవ భావన కలిగించని,
వన జీవనమెందుకులే!!
కలిసిపోదాం వన్నెలచోటుకి,
వెలిగిద్దాం ఆ చీకటి పొద్దుని.

★★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

కాలమిట్టె గడచిపోవు కనుల ముందు
కలయొ నిజమిదొ యన్నట్లు కరగిపోవు
నిన్నటికి నేటికిని భేదమెన్నలేను
భేదముండదు రేపంచు విశ్రమింతు

విశ్రమింతును, గృహమెల్ల విశ్రమించు,
విశ్రమింతురు పిన్నలు పెద్దలెల్ల,
విశ్రమించును దేశము విశ్వమెల్ల
కనులు తెరుచును సామాన్యదినము కొరకు

ఎచటిదీ దుందుభీరవమీ దినాన
ఏల కారుమబ్బులు నిండెనెల్ల దిశల
ఏల మారినదిట్లు మహీతలమ్ము
ఏల ఛిద్రమైనది నాదు హృదయమిట్లు

నాశమగుచుండెనేల సుందరధరిత్రి
చెదరె మనుజులు స్వప్నముల్ జీవితములు
అసువు విలువెరుంగని భువికర్థమేమి
తట్టుకొని యాపగలరీ విధ్వంసమెవరు?

నిదురయో యిది, లేక కన్నీటి కొరత
యో, యశక్తతయొ, మదికనూహ్యమైన
దుర్గమక్షేత్రమో, యెట్లు నిర్గమింతు
మీ భయద కాననమునుండి యెవ్వడెరుగు?

COMMENTS